బడిగంటలు

[కథానిక]

= శ్రీ ఘట్టి ఆంజనేయశర్మ =

బడిగంటలు ఖంగున మ్రోగాయి. చెట్టుక్రింద ఆడుకొంటున్న పిల్లలంతా తేనెతుట్టెమీద రాయి పడినట్లు ఒక్కసారి చెదిరిపోయారు. అప్పుడే పార్వతి తల వంచుకొని చదువుకొంటున్న గోపీదగ్గరకు వచ్చి "లే, గోపీ, గంట కొట్టారు" అంది. అతను మెల్లిగా లేచి, చొక్కా, లాగూ దులుపుకొని పుస్తకాలు తీసుకున్నాడు. పార్వతి చెయ్యిపట్టుకొంది. ఇద్దరూ బడివైపు పురోగమించారు.

"లెక్కలన్నీ చేశావా పార్వతీ?" అన్నాడతను నడుస్తూ.

"చేశాలే, కాని,...ఇవ్వాళ నాతో కలిసి బండిమీద రాలేదేం ?" అంది ఆ బాల అమాయకంగా అతనివంక నింపాదిగా చూస్తూ.

గోపీ నిదానంగా చూసి "వచ్చేవాణ్ణే—"అని సగంలో ఆపి, "ఇవ్వాళ మానాన్న కూరలు తీసుకరమ్మంటే బజారుకు పోయా...ఆలస్య మయేటప్పటికి మీ యింటికి రాలేకపోయాను ... పారూ ..." అన్నాడు.

"ఈ సారి కెలాగో అయిపోయిందికాని...ఇంకెప్పుడూ అలా చెప్పకు !...నాకు తోచదు గోపీ—" అంది నిశ్చలంగా చూస్తూ...

వెనకాల సైకిల్ బెల్ మ్రోగింది. ఇద్దరూ వెనక్కు తిరిగారు. "రాంబాబు...గోపీ..." అంది కళ్లతో నవ్వుతూ. కాని కారుమబ్బుల్లోంచి మెరుపు మెరిసి అదృశ్యమైనట్లు ఆ బాలముఖం నల్లబడింది. గోపీ చిరునవ్వు నవ్వాడు. రాంబాబు సైకిలు దిగి, షరాయిలోంచి సెంటెండ్ కర్చీఫ్ తీసి "గోపీ, హోమ్ వర్కు చేశావా ?" అన్నాడు. అసలతనికి ఎప్పుడూ ఆ అలవాటే లేదు ! గోపీ తన జీర్ణవల్కలాల్ని, మాసినపుస్తకాల్ని చూసి చిన్నబుచ్చుకున్నాడు.

"ఆ–చేశాను" అతను నిర్లక్ష్యంగా, క్లుప్తంగా అన్నాడు.

"సరేకాని, ఇవ్వాళ్టికి నీ నోటుపుస్తకం నాకివ్వు–నేను చెయ్యలేదు."

రాంబాబు దబాయింపు అతని కర్థంకాలేదు. పార్వతి ఎటో చూస్తోంది.

"పోనీ, కాపీకొట్టిస్తా-ఇట్లా పడేయ్ పుస్తకాన్ని" అన్నాడు అధికారపూర్వకంగా.

ఎవ్వరూ మాట్లాడలేదు.

"ఏం, నువ్వు తెలివికలవాడిననేనా మహా విఱ్ఱవీగుతున్నావ్?" అన్నాడు, ఏవగింపుగా.

గోపీ మాట్లాడలేదు. అసలు మాట్లాడకూడ దనుకున్నాడు.

"పారూ, పోనీ నువ్వన్నా ఇవ్వవూ?"

పార్వతి అయిష్టంతో చూసింది.

అతనికి కోపం వచ్చింది. "అవునులే....ఎందుకిస్తావ్ ? వాడి స్నేహం చేసి...తా చెడ్డ కోతి...చింకిగుడ్డల వెధవాయ్..." అన్నాడు వుడుకుమోత్తనం

పట్టలేక. అతను వేటకాడిలా బాణాల్ని వదులుతున్నాడు.

గోపీ "నేనేంచేశాను?" అన్నట్లు చూసి, తల వంచుకొని వెళ్లిపోయాడు. తనవలన పార్వతికికూడ నింద యెందుకు? "గోపీ-గోపీ" పార్వతి లేడిలా పరుగెత్తింది. రాంబాబు విషాదంగా నవ్వి "పారూ, పోబోకు-మంచి రోజాపువ్వు నీకు" అని జేబులోంచి తీశాడు. పార్వతి "డైలమా" లో పడింది! గోపీకి తనమీద కోపం వచ్చిందేమో! అప్పుడే అతను కనుచూపుమేర దాటి క్లాసులోకి పోయాడు. బాబు దగ్గరకు వచ్చి "వాడు పోతే అంత ఖంగా రెందుకు? పారూ, మన దర్జా వాడికేం వుంది?" అంటూ తల్లో పువ్వు పొదివాడు. అత నేంచేస్తున్నాడో తనకు తెలియదు. నాగస్వరానికి పాము నిచ్చేష్టయిపోయినట్లు, తనూ చేతనాచేతనాలన్నీ మరిచి నివ్వెరపోయినట్లుంది. అత నంగీకారంగా భావించుకొని "మాఇంటి కొస్తే పెద్ద ప్రెజెంట్ నీకు. మానాన్నగారికి నువ్వంటే చాలా ఇష్టం. వస్తావుకదూ?" అంటూ నడిచాడు. పార్వతి ఈ ప్రపంచంలోకి వచ్చినట్లయి అతన్ని విచిత్రంగా చూసింది. అత నేం చేశాడు? తనతల్లో పువ్వు పెట్టాడు! కాని గోపీ అంటే అంత ద్వేషం యెందుకు? పాపం, అతని హృదయం ఎలా బాధపడివుంటుందో! తనతో ఆడుకోడు. తన ఇంటికి రాడు. పార్వతి కన్నుల నీరు నింపుకొంది. ఎందుకూ బాధ? తను గోపీకి అకారణంగా దూరమయిపోతుందా? రాంబాబు గొప్పేమిటి? భాగ్యవంతులు కానివారు మర్యాదకూ, గౌరవానికీ లోకువా? బాబు చూసి చూసి, అనునయంగా పార్వతిచెయ్యి పట్టుకొని "ఏమిటీఆలోచిస్తున్నావ్? నీ కేం తెలీదు. బలే పిచ్చిదానివి-రా నేచెప్తా" అన్నాడు. పార్వతి అతన్ని ద్వేషించక పోయినా ఇష్టం లేదు. మందగమనాలతో క్లాసులోకి పోయారు.

* * * *

వారంరోజులైంది. గోపీ పార్వతిని తప్పించుక తిరుగుతున్నాడు. ఎవ్వరితోనూ విస్తారంగా మెదలక తన పని తాను చూసుకవస్తున్నాడు. ఆ వేళ గంటకొట్టగానే ఇంటిదోవ పట్టాడు. బండిమీద పోతున్న పార్వతి దృష్టిని తప్పించుకోలేకపోయాడు. "గోపీ - గోపీ -" అంటూ కోయిలలా పిలిచింది. గోపీ ఆగక తప్పింది కాదు. ఛటుక్కున బండిదిగి "నే నేం చేశాను? నామీదెందుకు కోపం?" అంది. అతను సమాధానపూర్వకంగా ఆ బాలకళ్లల్లోకి చూశాడు. నోటినుంచి మాట తెమలక ఎలాగో "నాతో మాట్లాడకుండా—మా ఇంటికి రాకుండా...నువ్వు" అని కళ్లు తుడుచుకుంది. కాని అత నిదివరకే భాగ్యవంతుల పిల్లలతో స్నేహం చెయ్యకూడ దనుకున్నాడు. కాని ఆ బిగువంతా ఆ నిర్మలస్నిగ్ధలావణ్యమూర్తి అశ్రుధారల్లో కరిగిపోయింది. "పారూ" అన్నాడు ప్రశాంతంగా. ఆ బాలకు తన మనోగతాభిప్రాయాలు తెలియకూడదని అతని అభిమతం. "దా-మా ఇంటికి పోదాం" అంది. "వస్తా పారూ-నా కెందుకు కోపం? బీదవాళ్లకి కోపం వుండరాదుకదూ?" అన్నాడు. పార్వతి మాట్లాడకుండా అతని చెయ్యి పుచ్చుకొని బండిదగ్గరకు పోయింది. గోపీ కళ్లల్లో తన "చింకిగుడ్డల రూపం" అగుపడింది. తను నిర్దోషినని తెలుసు. అందరూ తన తెలివిని చూచి చాటుగా ఈర్ష్యపొందుతారని తెలుసుకున్నాడు. స్నేహానికి హూందా, గౌరవం, ధనం వుండాలా? అతడు తటపటాయిస్తున్నాడు. పార్వతి భాగ్యవంతుల పిల్ల అయినా చాలా అమాయకురాలు! అతనికి తెలుసు... ఆమె...నిర్దోషి ... బండెక్కబోతున్నాడు. అప్పుడే కారు వారి ముందు ఆగటంతో ఇద్దరూ విభ్రాంతులైనారు. రాంబాబు చిరునవ్వుతో కారులోనుంచి దిగి "ఓహో ... పార్వతి ... ఇక్కడున్నావా?" అన్నాడు. పార్వతి గోపీచెయ్యి వదిలింది. అతనివంక కోరచూపులు చూస్తూ "నీ కోసం ఎంత వెతికాను!- ఇవ్వాళ మా ఇంట్లో టీపార్టీ కూడాను. మా నాన్నగారు నిన్నుగురించి అడిగారు. రా-పార్వతీ" అన్నాడు. "బాధించక" అన్నట్లు చూసింది పార్వతి.

"గోపీకూడానా?" అంది అప్రయత్నంగా. గోపీ మెదళ్లో ఆత్మాభిమానం చావలేదు. హీనస్వరంతో "నేను పోతా-మానాన్న కోప్పడతాడు" అన్నాడు పోబోతుండగా పార్వతి ఆపి, బండిలో కూర్చునేవరకూ బలవంతంచేసింది. "నేను రాను" అని చెప్పి తనూ

బండిలో కూర్చుంది. పాముకాటు తప్పినట్లు రాంబాబు బాధపడ్డాడు. పార్వతి ఆ అనాగరికగొడ్డుమీదున్న అభిమానం తనమీద లేదు. అతనికి గోపీపై చెడ్డకోపం వచ్చింది. ఈసారి గోపీకి దేహశుద్ధిచేస్తేగాని తనకు సంతృప్తి కలగదు. దహించుకపోతున్న హృదయంతో కారక్కాడు.

*　　*　　*　　*

పార్వతి మర్నాడు మామూలుప్రకారం గోపీ తనతో రాకపోతే కాచుకునే మఱ్ఱిచెట్టుదగ్గరికి వచ్చింది. అతను లేడు! గోపీ కూర్చుండేచోటు దగ్గర కొన్ని పుల్లలు పడివున్నాయ్. పిట్ట అరుస్తూ వుంది. ఎవరో గూటిని పడగొడితే గూడు చెట్టునుంచీ పడిన పుల్ల లవి. మగపావురం దెబ్బ తిని పడుంటే గువ్వ రోదిస్తూంది. కాసేపు పార్వతి దానివంక చూసి క్లాసు లోకి వచ్చింది. పిల్లలంతా తలోవిధంగా చెప్పుకుంటు న్నారు. గోపీని రాంబాబు చీకట్లో కొట్టాడని కొందరూ, నౌకరుచేత తన్నించాడని కొందరూ అనుకుం టున్నారు. ఆ అమ్మాయి విభ్రాంత అయింది. ఏడుస్తూ ఇంటికిపోయి ఓమూల కూర్చుంది. అన్నం తినలేదు! తనకు తెలుసు పిరికి రాంబాబు కొట్టలేడని! కాగా ఏ నౌకరుచేతనో చీకట్లో, నిస్సహాయస్థితిలో కొట్టించి వుంటాడు! ఆ చిన్నహృదయం గాలిలోని ఆకులా రెప రెపలాడింది.

*　　*　　*　　*

మర్నాడు గోపీకి జ్వరం వచ్చే చిహ్నాలు అవు పించినాయి! తన్ని నిర్దయగా కొట్టించిం దెవరో తెలి యకపోలేదు. ఎలాగో బడికి వెళ్లాడు ప్రయాసతో. ఎప్పుడూ అనుకోని విషయం జరిగింది. హెడ్మాస్టరు తన్ను పిలిపించి తూలనాడటంతో మతిహీనుడై నాడు. రాంబాబు తన్ను కొట్టించి, తననుకొట్టించినట్లు ఫిర్యాదు చేశాడు. తను బడికిరాకపోవటం కారణం సాకుగా చూ పాడు. అవును. భాగ్యవంతుడిబిడ్డకు కొదవేమిటి? హెడ్ మాస్టరు తనని పదిహేనురోజులు సస్పెండుచేసి, పది రూపాయలు జుల్మానా విధించాడు. తనేం చెబు తాడు? చెప్పినవన్నీ చెవిటివానివద్ద శంఖం వూదినట్లు భావించబడింది! వణికిపోతూ ఇంటికివచ్చి తండ్రితో కన్నీరు కారుస్తూ చెప్పాడు. తండ్రి పదిరూపాయలు చెల్లించలేని అసహాయస్థితిలో వున్నాడని తనకి తెలు సు! గత్యంతరం లేకపోయిం దతనికి. ఎప్పుడూ త పిన్నకోర్కెల్ని తండ్రిహీనస్థితిలో పోల్చి, చంపుకునే వాడు!

తండ్రి సానుభూతి వహిస్తా డనుకొన్నాడు. కాని ఆయన కోపంతో ప్రకంపించి "గాడిదా-ఎంత పని చేశావ్!-ఇంత వెధవవి వున్నావో లేదో ఎంత పౌరుషం!" అంటూ వెఱ్ఱిగా బాదాడు. గోపీకి దేహం పచ్చిపుండైంది. "తల్లి లేని వెధవవి!-నీకోసం పెళ్లి చేసుకోకుండా కష్టపడుతుంటే జరిమానాలు చెల్లిం చడంకూడానా?" అంటూ దూషించాడు. గోపీకి ఆ నీరసస్థితిలో ఆలోచించి సమాధానం చెప్పే పరిజ్ఞానం కూడా పోయింది. తండ్రి మొన్న మొన్నటివరకూ గుమా స్తాపని చేసి ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నవాడు! తన పసిహృదయం ఇంకా అంత పరిపక్వానికి రాలేదు! అది దోషమా? ఇదంతా ఓ బూటకంలాగుం దత నికి!-నిజం మాట్లాడాలని పుస్తకాల్లో చదివాడు. ఆచ రణలోకి వస్తే అంతా తారుమారే! హింస పనికిరాదని ఉపాధ్యాయుడు బోధిస్తాడు. కాని చేసేదీ, జరిగేదీ హింసకాక మరేమిటి? గోపీ సాయంత్రంవరకూ అలాగే పడుకున్నాడు. తన్నెవ్వరూ భోజనం చెయ్య మనలేదు! తన స్థితీ, రాంబాబుస్థితీ చూచుకొనేటప్పటికి అప్రయ త్నంగా కన్నుల నీరు నించుకొన్నాడు. అతడు ప్రపం చానికి ఓ తృణప్రాయం!

రాత్రికి గోపీకి జ్వరం వచ్చింది. అక్కడినుంచీ లేవలేకపోయాడు. క్రమంగా తండ్రికి కోపం తగ్గి కొడు కును చూసి కూలబడిపోయాడు. మెల్లిగా మంచంమీద పడుకోబెట్టి ఒళ్లుపట్టాడు. వైద్యుణ్ణి పిలుచుకువచ్చి మందిప్పించాడు.

*　　*　　*　　*

పార్వతి గోపీ రాకపోవటం చూసి బెంగపెట్టు కుంది. రాంబాబును నిలవదీసి అడిగింది. అతడు దొంగలా ఆ ప్రసక్తి తనవద్ద తేవద్దన్నాడు!-నాలుగో రోజు న తండ్రితో చెప్పకుండా గోపీఇంటికి వచ్చింది. గోపీ

జ్వరం మిన్నుముట్టింది. అతడు గుర్తుపట్టే స్థితిలో లేడు. పార్వతి తిరిగివచ్చింది.

ఆ రాత్రి నూటఅయిదువరకూ టెంపరేచర్ వచ్చింది. ఒక్కటే పిచ్చిమాటలు-"నాన్నా, బడి గంటలు కొట్టారు-పుస్తకాలివ్వు-పోతా-"అంటూ లేవ బోయేవాడు. "నాన్నా-లెఖ్ఖల్లో నాది ఫస్టుమార్కు, ఇంగ్లీషులోనూ నాదే-అసలు అన్నీ నావే నాన్నా!-" అంటూ అలమటించేవాడు. తండ్రి దిగాలుపడిపోయాడు. తన అనాలోచితప్పనికి ఎటువంటి శిక్ష విధించబడుతుందోనని. "నాయనా, నిన్ను కొట్టిన ఈ చేతులు చేతులు కావు-రాళ్లు-హంతకుణ్ణి" అని రోదించేవాడు. చేతులు కాలింతర్వాత ఆకులుపట్టుకోడం!

తెల్లవారు గట్ల గోపీ ఆయాసంతో మంచంకేసి తలను కొట్టుకున్నాడు. చూపు వెఱ్ఱిచూపుగా మారింది! తండ్రి దుఃఖాన్ని దిగమింగుకుంటూ కాస్త పండ్లరసం గొంతులోపోసి, ప్రక్క సద్ది అనునయించాడు. గోపీ కళ్లు మూయంగానే వైద్యుడివద్దకు పరిగెత్తాడు. రాంబాబు గోపీని గురించి విని చాలా భయపడ్డాడు. జాలిపడ్డాడు కూడా. దారిలో "ఎలా వుం"దని తండ్రి నడిగాడు. సమాధానం రాక, గోపీస్థితిని వూహించుకున్నాడు. తను ఎంతపని చేశాడు? గోపీకి జీవితాశ వుందా? అతను పరితప్తహృదయంతో పార్వతిఇంటికి వెళ్లాడు. ఆ బాల ఏడుస్తూ పుస్తకంమీద పిచ్చిగీతలు గీస్తోంది. బాబుని చూడటంతోనే ఆమె ముకుళించుకుపోయింది. అతడు ప్రాధేయపూర్వకంగా "క్షమించు-ఒక్కసారి గోపీని చూద్దాం రా" అన్నాడు. ఇద్దరూ వెళ్లారు.

ఆయాసంతో, ఆత్రతతో చూసే తండ్రినీ, జాగ్రత్తగా పైకి ఎటువంటి భావాన్నీ వ్యక్తపరచని వైద్యుణ్ణీ చూసి పార్వతి పెద్దగా యేడ్చింది. ఏడుస్తూనే గోపీకాళ్లదగ్గర కూర్చొని "గోపీ-నన్నొకసారి చూడు. నాకది చాలు" అంది. రాంబాబు దీనంగా "గోపీ-నన్ను క్షమించు గోపీ, నీ కాళ్లు పట్టుకుంటా" నన్నాడు. తండ్రి గద్గదస్వరంతో చేతులుపైకెత్తి "నా ప్రాణాన్నైనా తీసుకుని నా కొడుకును బ్రతికించు తండ్రీ" అని ప్రార్థిస్తున్నాడు. పంజరంలోని పిట్టలాగా కుమిలిపోయాడు.

వైద్యుడు పెదవివిరిచి, స్టెతస్కోపు తీసేసి నిట్టూర్పు విడిచాడు. గోపీ కళ్లు తెరిచాడు. అందరివంకా చూశాడు. అర్థంచేసుకొన్నారో లేదోకాని!-లేవడానికి ప్రయత్నించి విఫలుడైనాడు. చివరకు కళ్లు మూసుకొని, తల ప్రక్కకుతిప్పి ఎవ్వరివంకా చూడకుండా "నిర్ఘోషిని - నాన్నా, గంటలు వినిపిస్తున్నాయ్-బడికి పోతున్నాను-ఇదిగో" అన్నాడు.

బడిగంటలు యథాప్రకారంగా ఖంగున మ్రోగాయ్. ప్రకృతి విషాదస్వరంతో విలపించింది.....



తరణోపాయం ('కృష్ణ'లో తెప్పలు)